సాయంత్రం ఏడుగంటలయింది.

ఎప్పట్లా నేనూ, అన్నయ్యా ఆఫీస్ నుంచి వచ్చేసి వదిన ఇచ్చిన కాఫీ టిఫెన్లు యథాప్రకారం స్వీకరిస్తున్నాం.

వదిన అన్నీ ముక్తసరిగా బల్లమీద పెట్టేసి వెళ్ళిపోయింది. ఆమె నాతో మాట్లాడి సరిగ్గా వారం రోజులు దాటింది.

'నాకిప్పుడే పెళ్ళి వద్దు— నే చేసుకోను' అన్న కారణానికి ఆమె నాతో మాట్లాడడం మానెయ్యడం నాకెంతో విచారం కలిగించిన విషల్లో ఒకటి. నిర్లక్ష్య ధోరణి ఆమెకెంతో మనస్తాపం కలిగించడం నాకు విచారం కాక మరేమిటి?

అన్నయ్య మాత్రం శుభ్రంగా వదిన ఇచ్చిన కాఫీ, ఫలహారాలు తాపీగా సేవించి రిలాక్స్‌డ్‌గా కాళ్ళు పైకి లాక్కుని ప్రొద్దున చదవగా మిగిలిన వార్తల పకోడీలు నెమరేస్తూ కూర్చున్నాడు.

అసలు నా సంగతేదీ అర్థం కానట్లు, మా మధ్య సయోధ్య లేదన్న విషయం తనకేం తెలీదన్నట్లు పెట్టిన అయోమయపు ముఖం నాకెంతో చిరాకును

# ప్రేమ ఋతువు

కలిగిస్తోంది.

అలాంటి ఇబ్బందికరమయిన వాతావరణాన్ని ఒక్కసారిగా మెరుపులా మాయం చేస్తూ వదిన "రేపుదయం సరయు వస్తోంది— నువ్వెళ్ళి తీసుకు రావాలి" అంది.

సరయు వదిన చెల్లెలు— నేనామెను పదేళ్ళ క్రితం చూశాను. అప్పట్లో ఆమెకు పదేళ్ళుంటాయి. నాకు పదిహేను.

ఇంతకీ వదిన ఎవర్ని ఉద్దేశించి అన్నదో అర్థంకాక అన్నయ్య ముఖంలోకి చూశాను. అక్కడ అన్నయ్య తాలూకు ముఖం బదులు హిందూ పేపర్ కనిపించింది.

అంటే ఆమె నన్నుద్దేశించే అన్నదని అర్థం చేసుకున్నాను.


నేను ఎప్పట్లా సర్వసాధారణ పరిస్థితిలో "అబ్బే నావల్ల కాదొదినా! అన్నయ్యని పంపించు" అన్నాను.

అన్నాక తెలిసింది. నేను వారం తర్వాత తిరిగి వదినతో మాట్లాడానని— పైగా ఆ మాట కూడా చాలా కటువుగా అన్నానని.

చప్పున ఆమె ముఖంలోకి చూశాను. అక్కడ వెలవెలబోతున్న ఛాయలు నా గుండె చుట్టూ గుండుసూదుల్లా తిరగసాగాయి.

గిర్రున వెనుదిరిగి వెళ్ళిపోతున్న ఆమె చేయి చప్పున పుచ్చుకుని "లేదు— నే వెళ్తున్నాను" అన్నాను.

కానీ నేను ఆశించిన ప్రసన్నకరమైన ధోరణి ఆమె ముఖంలో కనిపించలేదు. తన మనసులోని భావాలు ముఖంపైన ప్రతిఫలించనీయకుండా జాగ్రత్త పడుతూ చాలా మృదువుగా "నీ ఇష్టం ఉదయ్! నువ్వు చాలా పెద్దవాడివైపోయావు. నేనేం నీకు కన్నతల్లిని కాదు కదా? శాసించి నీ పనయినా చేయించడానికి?" అంది చేయి విడిపించుకుంటూ.



నా హృదయమనే కవాటంలోకి అగ్ని సెగలా ప్రవేశించాయి వదిన మాటలు. ఆ సెగల వేడి తప్పించుకునే మార్గంగా "నేను రేపు ఉదయం వెళుతున్నాను" అన్నాను.

వదిన నాకేసి కూడా చూడకుండా లోపలకు వెళ్ళిపోయింది

అంతా వింటూ కూడా తాపీగా కూర్చున్న అన్నయ్యను చూసి చిరాగ్గా లేచి పేపర్ లాగి పక్కన పడేశాను.

అన్నయ్య కోపంగా 'ఒరేయ్ పాలికేళ్ళ అడ్డగాడిదా? మీ వదిన మాటకు నేను జవదాటను. నువ్వెళ్ళకపోతే నే వెళతాను. నీ స్వార్థం నువ్వు చూసుకో'' అనేసి తిరిగి పేపర్ లాక్కుని రేసుల్లో గుర్రాల బలాబలాలు చదువుకోసాగాడు.

ఒక్క క్షణం ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఇంట్లో అంతా నాకు శత్రువులే అనిపించింది. ఎప్పట్లా లేచి ఫ్రెండ్స్‌తో బతాఖానీ వెయ్యడానికి వెళ్ళ బుద్ధికాలేదు. అలాగని ఈ వాతావరణంలో ఇంట్లోనూ ఉండబుద్ధి కాలేదు.

అప్పుడొచ్చింది బుర్రలో ఆలోచన.

చప్పున లేచి నా బైక్ కీస్ తీసుకుని లోపలున్న వదినకు వినపడేంత గట్టిగా "వదినా, నేవెళుతున్నాను!! ఏకంగా రేపుదయం సరయుని తీసుకునే ఇంటికి వస్తాను" అని అరిచి బయటకొచ్చేశాను.

నా మాటలు వినిపించిన మరుక్షణం వంటగదిలో చేస్తున్న పనులు అర్థాంతరంగా ఆపేసి వదిన కంగారుగా బయటకు పరుగెత్తుకొచ్చింది.

అప్పటికే కిక్ కొట్టిన నా బండి పొట్లగిత్తలా

ముందుకురకడానికి సిద్ధంగా ఉంది.

"ఇదిగో నిన్నే— అరే— ఆగమంటుంటే— సరయు వచ్చేది రేపొద్దున— బస్సెక్కడాగుతుందో చెప్పనీ" అంటూ అరుస్తూన్న వదిన మాటలు గాలిలో కలిసిపోయాయి.

నా బండి ముందుకురికింది.

'ఎంత మొండి మనిషో' అంటూ ఆమె విసుక్కుంది. ఆ తర్వాత బాధపడింది.

* * *

ఆఘమేఘాల మీద సాగుతున్న బండిని ఎక్కడాపాలో అర్థం కాలేదు. సరయు వచ్చేది రేపుదయం. అదీ విజయవాడ నుంచి.

ఆమె వచ్చే బండి గౌలిగూడాలో ఆగుతుంది. ఆపైన లకడీకాపూల్‌లో ఆగుతుంది, ఆ తర్వాత అమీర్‌పేటలో ఆగుతుంది.

ఇల్లు జూబ్లీ హిల్స్‌లో—

సరయు ఎక్కడ దిగుతుందో నిజంగానే తెలీదు.

ఎక్కడాగాలన్నా ముందు గౌలీగూడాకు రావలసిందే. కాబట్టి అక్కడే ఆపెయ్యడం ఉత్తమం అనుకున్నాను.

ముందు 'యాంకీడూడుల్స్' దగ్గర చేరే మిత్ర బృందం దగ్గర రాత్రి తొమ్మిదింటిదాకా గడిపేశాను.

ఆ తర్వాత సైక్లైన్‌లో '(పెడేటర్' సినిమా సెకండ్ షో చూశాను.

అప్పటికి సమయం పన్నెండయింది.

ఇక గౌలీగూడా బస్ స్టాండ్‌లో బైఠాయించడం ఉత్తమం అనుకున్నాను.

ఆఘమేఘాల మీద బండి బస్ స్టాండ్ చేరుకుంది. పార్కింగ్లో అన్ని పార్క్ చేసి లోపలకొచ్చాను. ఆకలి వెయ్యడం లేదు.

కూర్చోడానికి కుర్చీలున్నాయి. నవంబర్ నెల కావడంతో చలికూడా వేస్తుంది. చలికి శరీరం ముడుచుకుపోయి అదోరకమయిన గగుర్పాటును కలిగిస్తోంది.

ఇప్పట్నుంచీ ఉదయం ఆరింటి దాకా వచ్చే ప్రతి బస్సూ వెదుకుతూ కూర్చోవాలి.

అది కూడా సరయు కోసం.

నాకు తెలిసిన సరయుకు పదేళ్ళు— చాలా అల్లరి పిల్ల— అప్పట్లో నాతో సమానంగా గోలీలు, క్రికెట్ ఆడగలిగిన ఒకే ఒక వ్యక్తి సరయు.

ఇంత కాలం తర్వాత చూడబోతూన్నందుకు ఒక రకమయిన ఉద్వేగంగా ఉంది. అందుకే ఈ ఎదురు చూడ్డంలో ఒక రకమయిన ఆనందం కూడా ఉంది.

తను గుర్తు పట్టగలదో లేదో.

అనుకుంటూ బల్లమీద కూలబడ్డాను— కుడి వైపున వచ్చే ప్రతి బస్సునూ పరికించి చూస్తూ.

సమయం చాలా భారంగా గడిచిపోతూంది.

ఎదురు చూపుల్లో ఇంత నరకం ఉంటుందని జీవితంలో మొదటిసారిగా ఇప్పుడు అర్థంచేసుకున్నాను. మొండి తనానికి పోతే ఎంత నష్టమో కూడా అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను.

* * *

సరిగ్గా ఐదుగంటలకి బస్సు ఆగింది.

నేను యథాప్రకారం బస్సు కిటికీల్లోంచి వెదుకుతున్నాను. సరయు అనబడే శాల్తీని నేనేమన్నా గుర్తించగలనేమోనని.

నేను గుర్తించే అవకాశమే ఇవ్వకుండా "ఏయ్ చిబా!" అంటూ అరిచిన సరయు గొంతు విని ఆశ్చర్యంగా చూశాను.

ఇరవయ్యేళ్ళ అపురూప లావణ్యవతి ఏ మాత్రం సదరూ, బెదురూ లేకుండా కిటికీలోంచి నన్నే చూస్తూ అంది.

రాత్రంతా ప్రయాణం చేసినా ఎక్కడా అలసిపోయిన ఛాయలు నాక్కనిపించలేదు. వేలకొద్దీ గులాబీలు రాత్రంతా కురిసిన తుషార బిందువుల స్వచ్ఛతతో ఒకేచోట విరగబూసిన అనుభూతి కలిగింది. ఆమెతో పాటే ప్రేమ ఋతువు వెంట తీసుకుని వచ్చినట్లుగా ఉంది.

సరయు చిన్న సూట్‌కేస్ తీసుకుని బస్సు దిగి వచ్చేసి "అదేంటి? నేను అమీర్ పేట్‌లో దిగుతానని అక్క చెప్పలేదా?" అంది నన్ను తేలిగ్గా గుర్తుపెట్టేసి.

పుట్టగుంట గోపీచంద్

"చెప్పింది. కానీ ఇక్కడే నిన్ను దింపేస్తే చాలా విషయాలు ఇంటికి వెళ్ళేలోగా మాట్లాడుకోవచ్చని" అన్నాను అప్రయత్నంగా.

సరయు నాకేసి మెరుపుల్లాంటిచూపులు ప్రసరిస్తూ "ఏం విషయాలబ్బా! చిబా చిన్నప్పుడు నువ్వు నాకు పదహారు గోలీలు బాకీ ఉన్నావున్నావు మర్చిపోయావా?" అంటూ పాత బాకీలన్నీ వెలికితీసుకొచ్చే ప్రయత్నంలో పడింది.

చిబా అంటే చిన్న బావ అని. అలా పిలవడంలో వెటకారం, వెక్కిరింత, సుళువు, షార్ట్‌కట్ షేప్ లాంటి ఎన్నో ఉపయోగాలు ఉండటంతో ఎంత మొత్తుకున్నా అలానే పిలిచేది.

"ఐతే ఇప్పుడు ఇంటికెళ్ళి ఆడదాం. నీ బాకీ చెల్లించేస్తాను" అన్నాను.

"ఇప్పుడా— నేను మర్చిపోయానే" అంది.

"అయితే బాకీ సంగతి మర్చిపో" అంటూ సరయు సూట్‌కేస్ అందుకుని ముందుకు నడిచాను.

"బాకీ సంగతయితే మర్చిపోతాను కానీ— నువ్వు జామకర్రతో కొట్టిన సంగతి మాత్రం మర్చిపోను. ప్రతీకారం తీర్చుకుంటాను" అంది నవ్వుతూ.

సరయూలో అల్లరేమాత్రం తగ్గలేదు. వయసుతో పాటు మరికాస్త పెరిగింది కూడా.

"ప్రతీకారం తీర్చుకునేంత పెద్దదానివయ్యావని సాక్ష్యమేంటి?" అన్నాను ఆమెను ఉడికిస్తూ.

అప్పుడు సరయు నాచేతిలోని బైక్ కీస్ లాక్కొని నువ్వు వెనక కూర్చో నే డ్రైవ్ చేస్తాను" అంది.

"ప్రతీకారమంటే ఇదా?"

"అప్పుడేనా? చాలావుంది"

సరయుకి చిన్నప్పుడు సైకిల్ నేర్పింది నేనే— కాబట్టే నిరభ్యంతరంగా కీస్ ఇచ్చాను. సరయు ఏ మాత్రం సదరూ బెదురూ లేకుండా నేర్పుగా కిక్ కొట్టి ముందు కూర్చుంది. వెనుక సూట్‌కేస్ పుచ్చుకుని నేను కూర్చున్నాను.

ఆమె బండి ఆఘమేఘాల మీద ముందుకు నడిపించింది.

ఆ వేగానికి ఆమె హెయిర్ నా ముఖం మీద తమ లావణ్యపు నాజూకులు పోవడంతో— ఎన్నడూ లేనిది నా హృదయం లయతప్పి అపస్వరాలు పలకడం మొదలెట్టింది. గాలి ఆడక ఉక్కిరి బిక్కిరవుతూన్న నేను అప్రయత్నంగా ఎడం చెయ్యి సరయు భుజం మీద వేశాను.

సరయుకేమనిపించిందో తెలీదు కానీ మెత్తగా తగిలిన ఆమె భుజం నాలోని అణువణువూ ఇంతవరకెప్పుడూ విని ఉండని సరికొత్త సంగీతం వినడం మొదలెట్టింది. పాతికేళ్ళ యువకుడి శరీరానికి స్త్రీ శరీరపు ప్రథమ స్పర్శాజ్ఞానం గుండె లోతుల్లో చెరిపి వెయ్యలేని తీపి పూతలు పూయించింది.

లోకం ఎటుపోతోందో తెలీదు కానీ నా చేతి నుంచి ప్రవహిస్తున్న విద్యుత్ నా శరీరానికి సరికొత్త ఆకలిని కలిగిస్తోంది. ఆ ఆకలి తీయతియ్యని అనుభూతిని పొందేలా చేస్తూంది. అలాగే ఉండిపోవాలని, ఆమెను మరింతగా హత్తుకుపోవాలన్న బలమైన కోరిక అనుకోకుండా కలిగింది.

ఆ కోరికను సమూలంగా నాశనం చేస్తూ సరయు "ఇవ్వాళ నాకిక్కడ పెళ్ళి చూపులు— నీకా సంగతి తెలుసా?" అంది.

ఎంతో కష్టపడి ఎక్కి శిఖరాగ్రాన నిలబడి ఆనందంతో కేరింతలు కొడ్తూన్న శరీరం— ఒక్కసారిగా పట్టుతప్పి అఘాదాల్లోకి జారిపోతున్నట్లుగా అయింది. అప్పటి దాకా వెర్రి ఆలోచనలు చేసిన మనోఫలకంపై పిచ్చి గీతలు పడ్డాయి. ఉదయపు పొగమంచు లాంటిదేదో హృదయం కనిపించకుండా కప్పుకుపోయినట్లయింది.

నేను సమాధానం చెప్పకపోవడంతో సరయు బండాపి "ఏంటి? ఏం మాట్లాడవు? నా పెళ్ళి చూపుల గురించి నీకెవరూ చెప్పలేదా?" అంది.

అప్పుడా బండి ఆగిన ప్రదేశం అన్నపూర్ణా స్టూడియోస్ అవతల రాళ్ళ గుట్టల దగ్గర.

అక్కడ్నుంచి చూస్తే సిటీలోని కొంతభాగం కనిపిస్తోంది. చిన్న చిన్న బొమ్మల్లా కనిపిస్తున్న ఇళ్ళల్లోంచి అప్పుడే ప్రజలు నిద్ర లేస్తున్న ఛాయలు ఎంతో ఇంపుగా కనిపిస్తున్నాయి.

ఉదయపు పిల్లగాలి నా చుట్టూ గింగరాలు కొడుతూ సమాధానం చెప్పమని వేధిస్తోంది.

నేను బండి దిగి దూరంగా ఉన్న రాయిమీద కూర్చొని సరయు కేసి చూడకుండా "నాకు తెలీదు" అని మాత్రం అన్నాను.

సరయు బండి పక్కన పార్క్ చేసి వచ్చి "భలే వాడివే— గాలిగూడా దాకా వచ్చి ఎక్కించుకుని చాలా విషయాలు చెబుతావంటే— నా పెళ్ళి చూపుల విషయమే అనుకున్నాను. అయితే నీకేం తెలీదన్న మాట" అంటూ నా పక్కనే ఉన్న రాయిపై కూల బడింది.

ఆ ఉదయం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. కానీ నాకు మాత్రం అసహ్యంగా తోచింది. నేనెంతో ఇష్టపడే శీతాకాలపు ఉదయమది. కానీ వేసవిలో నిప్పులు చెరిగే మండు ఎండలో కూర్చున్నట్లుంది.

పక్కనున్న సరయు నా ముఖంలోకి చూస్తుండ టం గమనించి వస్తున్న పెదవులపై నవ్వు పువ్వులు పూయించి" అయితే త్వరలో ఆంటీవి కాబోతున్నా వన్న మాట" అన్నాను వెక్కిరింతగా.

సరయు "అవును నాకొక మొగుడు వస్తాడు. కొన్నాళ్ళకి పిల్లలు పుడతారు. నా కంటూ ఓ సంసారం ఏర్పడుతుంది. ఆ నౌకలో పడి తేలుతూ ఉంటాను" అంటూ నవ్వింది.

నాకెందుకో ఆ నవ్వు సహజంగా అనిపించలేదు. నన్ను వెక్కిరిస్తున్నట్లు— నాలోని అణువణువునూ తీవ్రమయిన స్పందన కలిగించేలాచేస్తున్నట్లనిపించింది.

లేచి "పోదాం పద" అన్నాను.

ఈ సారి డ్రయివింగ్ నేను చేశాను.

* * *

సరయు, నేను ఇంట్లోకి వెళ్ళేసరికి అమ్మా నాన్న కూడా వచ్చి ఉండటం గమనించి చాలా ఆశ్చర్యపోయాము.


నాకు తెలీకుండా ఈ ఇంట్లో మొట్టమొదటి సారిగా జరుగుతోన్న రహస్య కార్యక్రమమిది.

నాకు తెలీకుండానే కోపం నన్ను దహించివేసింది.

ఈ రోజు ఇంట్లో సరయుకి పెళ్ళి చూపులు.

ఇక నేనిక్కడ ఎంతో సేపు ఉండలేననిపించింది. గబగబా స్నానం చేసేసి ఆఫీస్‌కి వెళ్ళడానికి తయారయి పోయాను.

నన్ను ఉండమని కూడా ఎవరూ బలవంతం చెయ్య లేదు. చివరికి వదిన కూడా. అసలామె నేను తన చెల్లెల్ని— రాత్రంతా పడిగాపులు పడి తీసుకొచ్చానన్న జాలి కనికరం కూడా కనిపించలేదు.




చింపిరి గుడ్డలతో తిరిగే దేశదిమ్మరి చిత్రాన్ని చూస్తూ ఓ ఇందుమతి ఇలా అంది— "శుభ్ర మైన జత బట్టలు కొనుక్కోలేదు గాని తన పెయింటింగ్ మాత్రం వేయించుకున్నాడు"

ఈ ఇంట్లో మొట్టమొదటిసారిగా ఒంటరి వాడి నన్న భావం నాకప్పుడు కలిగింది. నా అంతరంగపు ఛాయలేవీ బయటకు రప్పించే ప్రయత్నం చేయలేదు. అన్నింటినీ అంతరంగంలోనే సజీవ సమాధి చేసేసి— చాలా మామూలుగా ఆఫీస్‌కి వెళ్ళిపోయాను.

* * *

ఆ సాయంత్రం ఎప్పటికన్నా చాలా ఆలస్యంగా ఇంటికి వచ్చాను.

నేననుకున్నట్లే అంతా ఇంట్లోనే ఉన్నారు. ఏవో విషయాల గురించి సుదీర్ఘమైన చర్చలు జరపడం నేను గమనించాను.

నేను లోపలికి రావడంఆలస్యంఎక్కడి చర్చలక్కడ ఆగిపోయాయి. 'అది నేను లోపలికి రావడంతో' అన్న విషయం నాకు స్పష్టంగా అర్థమవటంతో నా అంత రంగపు సెలయేటిలో రాళ్ళురువ్వి అల్లకల్లోలం సృష్టించి నట్లయింది.

అంతటి అవమానాన్ని సహిస్తూ కూడా నేను లోపలకు వెళ్ళి స్నానం చేసి బట్టలు వేసుకుంటూండగా సరయు నా గది బయట నిలబడి "నువ్వు నన్ను రాత్రి పదిగంటల బస్సుకి ఎక్కించగలవా?" అని అడిగింది.

నేను ఆశ్చర్యంగా లోపల్నుంచే "ఏంటీరోజే వెళ్ళి పోతున్నావా?" అన్నాను.

"అవును వచ్చిన పనయిపోయింది" అంది.

"కాయా పండా?" ఆసక్తి ఆపుకోలేక అడిగాను.

"నువ్వు బయటకి రా బాబు చెబుతాను" అంది.

నేను నేను డ్రెస్ వేసుకోకుండా మామూలుగా పాంట్ షర్ట్ వేసుకుని బయటకొచ్చాను.

వదిన భోజనం వడ్డించింది మా ఇద్దరికీ.

"సరయు రెండు రోజులుంటే బావుంటుంది" అన్నాను అందర్నీ ఉద్దేశించి నేనెందుకలా అన్నానో నాకే తెలీలేదు. నా అంతరంగం అలా అనిపించింది నా చేత.

నేనన్న దానికి అంతా ముఖ ముఖాలు చూసుకున్నారు. కానీ ఎవరూ సమాధానం చెప్పలేదు.

నా మాటలు వినిపించుకున్నట్లే లేదన్నట్లు ప్రవర్తించారు.

వాళ్ళ ప్రవర్తనకు హృదయం భగ్గుమంది. ఇంకో మాట నోట్లోంచి రాకుండా గుండెలోపలే నొక్కేసుకున్నాను.

* * *

మార్గం మధ్యలో సరయు ఏం మాట్లాడలేదు. నేనూ మాట్లాడించడానికి ప్రయత్నించలేదు.

చివరికామే "నా పెళ్ళిచూపుల పట్ల నీకు పెద్ద ఆసక్తి ఉన్నట్లు లేదు" అంది.

నేను ఉలిక్కిపడి "అబ్బే అదేం లేదు. నువ్వే చెప్పు" అన్నాను.

"నేను పెళ్ళిచేసుకోవడం నీకిష్టమేనా?" చాలా సీరియస్‌గా, కోపంగా అడిగింది.

"ఒకరికి పెళ్ళి మరొకరి ఇష్టాయిష్టాలతో ముడిపడి ఉన్న రోజుల్లో మనం లేమనుకుంటాను?" అన్నాను.

సరయు మాట్లాడలేదు.మౌనంగాఉండిపోయింది.

బైక్ స్టాండ్‌లో ఆగింది.

సరయు దిగాక దాన్ని పార్క్ చేసి వచ్చి సూట్ కేస్ అందుకుని టిక్కెట్ కొని ఆమెను బస్సెక్కించి కిటికీ దగ్గరకొచ్చి నిలబడ్డాను. బస్సు కదలడానికి ఇంకొంత సమయం ఉంది.

కిటికీలోంచి చూస్తున్న సరయు ముఖం అదోలా ఉంది. ఆమె కళ్ళు అంతరంగాన్ని శోధించి దేన్నో కనుక్కోవాలన్నట్లు లోతుగా చూస్తున్నాయి.

ఆ చూపులతో చూపులు కలపడం చాలా కష్టంగా తోచింది. అయినా నిలదొక్కుకుని చూశాను.

"నువ్వు చాలా చిత్రమైన వాడివి సుమా?" అంది సరయు నన్నే తదేకంగా చూస్తూ.

"అంటే?" అర్థం కానట్లు చూశాను.

"అంటే... నువ్వొత్త మొద్దు ముఖానివి. మీ అన్నయ్య భాషలో చెప్పాలంటే పాతికేళ్ళ అడ్డగాడిదవి" అంది.

ఆమె ఆ మాటలు కోపంగా అందో, ప్రేమగా అందో నాకర్థం కాలేదు. డ్రైవర్ బండి స్టార్ట్ చేశాడు.

నేనామె మాటల్లోని అర్థంగాని భావాన్ని కనుక్కోవడం కోసం ఆత్రంగా బస్సుతో పాటే ముందుకు వేగంగా అడుగు వేశాను.

"రేపు మేలో మంచి ముహూర్తాలు ఉన్నయంట. అట్టే గొడవ చేయక ఒప్పుకో. నేను నిన్ను తప్ప వేరే ఇంకెవర్నీ చేసుకోనని చెప్పేశాను" అన్న సరయు మాటల్లో గాల్లో చలచల్లగాతేలి వినిపించాయి.

